క్లుప్తంగా

పిల్లలకు ఐరన్ మాత్రల పంపిణీ



ఉర్దూ హైస్కూల్‌లో పిల్లలకు ఐరన్ మాత్రలు మింగిస్తున్న ఆశా కార్యకర్త

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు ఎంటీసీపాలెంలోని ఉర్దూ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. పిల్లల్లో రక్తహీనతను నివారించేందుకు వారానికి ఒకరోజు ఈ మాత్రలు ఇస్తారు. ఆశా కార్యకర్త హజరా బీబీ మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులకు మాత్రలు మింగించారు. ఒకటి నుంచి ఐదో తరగతి పిల్లలకు పింక్ రంగు మాత్రలు (45 ఎంజీ), ఆరు నుంచి తొమ్మిదో తరగతి పిల్లలకు నీలం రంగు మాత్రలు (200 ఎంజీ) అందించారు. ముందుగా విద్యార్థుల బరువు, ఎత్తులను కొలిచారు. రక్తహీనత సమస్యను పరిష్కరించడానికి వారానికి ఒక రోజు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, సంవత్సరంలో రెండుసార్లు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని ఆశా కార్యకర్త తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో వారాహి అమ్మవారు



అలంకరణలో వారాహి అమ్మవారు

సీతంపేట: శ్రీలలితా పీఠంలో వారాహి నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి సహస్రనామార్చనలు, అభిషేకాలు నిర్వహించి, విశేష హారతులు సమర్పించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని పూజించారు. శుక్రవారంతో వారాహి నవరాత్రులు ముగుస్తాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

10న ధ్యానమందిరంలో గురుపౌర్ణమి వేడుకలు



గురుపౌర్ణమి వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలోని రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయిబాబా ధ్యానమందిరంలో ఈనెల 10వ తేదీన గురుపౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. ఆ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాన్ని ధ్యానమందిరంలో ఆవిష్కరించారు. గురుపౌర్ణమి రోజు ఉదయం నుంచి భక్తుల స్వహస్తాలతో బాబా వారికి క్షీరాభిషేకం, అనంతరం భారీ అన్నదానం, సాయంత్రం నుంచి ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు జరుగుతాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో 42వ వార్డు కూటమి నాయకులు ఆళ్ల శ్రీనివాస్, ఎస్‌కేఎంఎల్ విద్యా సంస్థల కరస్పాండెంట్ నాగభూషణం దంపతులు అతిథులుగా పాల్గొన్నారు.

హాస్య లఘు నాటికల పోటీలకు ఆహ్వానం

సీతంపేట: రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో హాస్య లఘు నాటికల పోటీలను నిర్వహించనున్నట్లు అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి ప్రకటించారు. ఈ పోటీల్లో పాల్గొనగోరేవారు 10 నిమిషాలకు మించని కామెడీ స్కిట్‌లను ప్రదర్శించాల్సి ఉంటుంది.పోటీదారులు తమ మేకప్ కిట్, దుస్తులు, వస్తు సామగ్రిని స్వయంగా తెచ్చుకోవాలన్నారు. మతం, కులం, ప్రాంతం, వ్యక్తులు లేదా రాజకీయాలను కించపరిచే విధంగా స్కిట్‌లు ఉండకూడదు.అశ్లీల పదజాలం లేదా ద్వంద్వార్థాలకు తావు లేదు. ఒక సంస్థ నుంచి గరిష్ఠంగా రెండు స్కిట్‌లకు మాత్రమే అనుమతి ఉంటుంది. ప్రథమ బహుమతి రూ. 25,000, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, ద్వితీయ బహుమతి రూ.15,000, తృతీయ బహుమతి రూ.10,000, ప్రత్యేక కన్సోలేషన్ ప్రైజులు (ముగ్గురికి) ఒక్కో స్కిట్‌కు రూ.2,000 అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 10వ తేదీలోగా తమ దరఖాస్తులను 'రైటర్స్ అకాడమీ, లీడర్ కార్యాలయం, వుడా లేఅవుట్, మద్దిపాలెం' చిరునామాకు పంపించాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాల కోసం ప్రోగ్రాం కన్వీనర్ మేడా మస్తాన్‌రెడ్డిని 9441344365, 9676040165 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆదమరిస్తే అంతేసంగతులు..!



సింహగిరి కాలనీ వద్ద కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న గెడ్డ రక్షణ గోడ

- గెడ్డలు, డ్రైనేజీలకు రక్షణ చర్యలు శూన్యం
- కనీసం హెచ్చరికలు కూడా లేని వైనం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ పరిధి 45,46,42వ వార్డుల పరిధిలో గల పలు ప్రాంతాలలో గెడ్డలు, డ్రైనేజీలు, కాలువలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏ మాత్రం ఆదమరిచినా ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోవలసిందే. లక్షల రూపాయలు వెచ్చించి డ్రైనేజీలు, గెడ్డలు నిర్మిస్తున్న జీవీఎంసీ సిబ్బంది కనీస రక్షణ చర్యలు చేపట్టకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడడం ఎంతవరకు భావ్యమని ప్రజలు వాపోతున్నారు. గెడ్డలకు రక్షణ గోడలు నిర్మించాలి, లేదా తాత్కాలిక ఏర్పాటలైనా చేసి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. జీవీఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో గెడ్డలు, డ్రైనేజీలు, కాలువలు ప్రజల ప్రాణాలను తోడేసే మృత్యుకూపాలుగా మారాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మాణాలు చేపడుతున్నా, కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. తక్షణమే రక్షణ గోడలు నిర్మించాలని, లేదంటే తాత్కాలిక ఏర్పాట్లనైనా చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.



సాలగ్రామపురం పోర్ట్ వాటర్ ట్యాంక్ ఎదురుగా రక్షణ గోడ లేని కల్వర్టు

తాటిచెట్లపాలెంలో పొంచి ఉన్న ప్రమాదం

తాటిచెట్లపాలెంలో కైలాసపురం, సింహగిరికాలనీ, లక్ష్మీనారాయణపురం, వాసుదేవనగర్ వంటి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ప్రధాన గెడ్డ తీవ్ర ప్రమాదకరంగా ఉంది. దీనికి గతంలో రక్షణ గోడలు, ఆధునికీకరణ పనులు చేపట్టలేదు. ముఖ్యంగా, తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద, అలాగే పెట్రోల్ బంకు పక్కన కనీసం ఒక్క రక్షణ గోడ కూడా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. రాత్రివేళల్లో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఈ గెడ్డలో కూరుకుపోవడం ఖాయమని స్థానికులు చెబుతున్నారు. ఇటీవలే జాతీయ రహదారి పక్కనే గెడ్డలో పడి ఓ ఆటో డ్రైవర్ మృతి చెందిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇటువంటి దుర్ఘటన ఇక్కడ కూడా సంభవించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.



80 ఫీట్‌రోడ్డులో రక్షణ గోడలు లేని గెడ్డ

కొట్టుకుపోయిన డ్రైనేజీ గోడ

తాటిచెట్లపాలెం హైవే పక్కన బస్టాప్ వెనుకవైపు ఉన్న డ్రైనేజీ గోడ గతంలో వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో రోడ్డు ఉందని భావించి ప్రక్కకు అడుగేస్తే నేరుగా డ్రైనేజీలో పడిపోయే ప్రమాదం ఉంది. ఈ గోడ కూలి చాలా నెలలైనా పట్టించుకునే నాథులే లేరని ప్రజలు వాపోతున్నారు. వర్షాలకు డ్రైనేజీ నిండి రోడ్డు మీదుగా మురుగు ప్రవహించడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.



తాటిచెట్లపాలెం హైవే బస్టాప్ వెనుక వైపు కొట్టుకుపోయిన రక్షణ గోడ

సింగాలమ్మపురంలో పాత డ్రైనేజీతో ముప్పు

సింగాలమ్మపురం, సింహగిరికాలనీ సరిహద్దులో ఉన్న పురాతన డ్రైనేజీ ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదంలో ఉంది. ఈ మార్గంలో ప్రతిరోజు అనేక మంది అధికారులు ప్రయాణిస్తున్నప్పటికీ, గిరి ప్రదక్షిణలకు ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ, ఈ డ్రైనేజీ వ్యవస్థ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ డ్రైనేజీకి ఎటువంటి హెచ్చరికలు, రక్షణ గోడలు లేకపోవడంతో రాత్రి వేళల్లో, చీకట్లో కొందరు ప్రమాదవశాత్తు పడిపోతున్నారని స్థానికులు పేర్కొన్నారు. చిన్నపిల్లలు, వృద్ధుల విషయంలో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాలగ్రామపురంలో మృత్యుద్వారంలా కల్వర్టు

సాలగ్రామపురం పోర్టు క్వార్టర్స్, పోర్టు వాటర్ ట్యాంక్స్ ఎదురుగా ఉన్న డ్రైనేజీ కూడా అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి మురుగునీరు పోయేందుకు నిర్మించిన ఈ డ్రైనేజీ సుమారు 15 నుంచి 20 అడుగుల లోతు, 6 అడుగుల వెడల్పు కలిగి ఉంది. దీనిపై నుండి సీతారామకళ్యాణ మండపం మార్గంలో ప్రజలు, వాహనాల రాకపోకలకు ఒక కల్వర్టు నిర్మించారు. అయితే, ఈ కల్వర్టుకు ఒకవైపు రక్షణ గోడ లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పొరపాటున ఏ వాహనమైనా, చీకట్లో మనుషులైనా ప్రక్కకు ఒరిగినా, పడిపోయినా నేరుగా 20 అడుగుల లోతు డ్రైనేజీలో పడాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఇంత ఎత్తు నుండి పడితే ప్రాణాలు దక్కుతాయో లేదో అర్థం చేసుకోవచ్చని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని, జీవీఎంసీ అధికారులు తక్షణమే ఈ ప్రమాదకర ప్రాంతాలలో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యం వహించి ప్రాణ నష్టం జరిగితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

80 ఫీట్ రోడ్డులో అస్తవ్యస్త పరిస్థితి

80 ఫీట్ రోడ్డులో కూడా ఇదే తరహా పరిస్థితి నెలకొంది. ఇక్కడ గెడ్డకు రక్షణ గోడలు లేకపోవడంతో ఆటోలు నిలిపి ఉంచడం, కొందరు వ్యాపారాలు చేసుకోవడం సర్వసాధారణమైంది. దీనివల్ల రోడ్డు ఇరుకుగా మారి తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.



రక్షణ గోడ లేని తాటిచెట్లపాలెం హైవే వద్ద వాసుదేవనగర్ గెడ్డ

"వర్షం పడితే గుబులు

తాటిచెట్లపాలెంలో బస్టాప్ వెనుక డ్రైనేజీ, గెడ్డ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. వర్షాకాలంలో ఏ ప్రమాదాలు జరుగుతాయో కంటిమీద కునుకు లేకుండాపోతుంది. డ్రైనేజీ గోడ కొట్టుకుపోయి కొన్ని నెలలైంది. ఇప్పటివరకు కనీసం రక్షణ చర్యలు చేపట్టలేదు."

ఎస్.వెంకటరమణ, తాటిచెట్లపాలెం

"రక్షణ గోడ నిర్మించాలి

పోర్టు క్వార్టర్స్ ప్రాంతంలో నిర్మించిన కల్వర్టుకు గతంలో రక్షణ గోడ కట్టారు. కానీ ఇది నేడో రేపో కూలిపోయేట్టుంది. ఒకవైపు రక్షణ గోడ లేకుండా పోయింది. పొరపాటున ఈవైపు నుంచి ఎవరైనా కింద పడితే ప్రాణాలకే ప్రమాదం. వెంటనే ఇక్కడ రక్షణ గోడ నిర్మించాలి."

ఎ.అప్పారావు, సాలగ్రామపురం

"పొంచి ఉన్న ప్రమాదం

సింహగిరికాలనీ, సింగాలమ్మపురం సరిహద్దులోని డ్రైనేజీలు నిర్మించి దశాబ్దాలు అయింది. అప్పటి నుంచి ఇవే డ్రైనేజీలు, ఇవి కూలిపోయే పరిస్థితిలో ఉన్నాయి. మరోవైపు ఇక్కడ డ్రైనేజీలకు ఎటువంటి రక్షణ ఏర్పాట్లు లేవు. చీకట్లో చూసుకోకపోతే ప్రమాదాలకు ఆస్కారం ఉంది. ఈ డ్రైనేజీలో ఇప్పటికే కొందరు పడిపోయారు కూడా."

-మహాలక్ష్మి, సింగాలమ్మపురం

శ్రీరామమూర్తి మాస్టారు సేవలకు ఘన సత్కారం



శ్రీరామమూర్తి మాస్టారి దంపతులను సత్కరిస్తున్న శిష్యులు

మురళీనగర్: రామమూర్తి మాస్టారు తన శిష్యులకు విద్యామృతాన్ని అందించిన గొప్ప వ్యక్తిగా కీర్తి గడించారని ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకటరమణ అన్నారు. బొబ్బిలి శ్రీరామమూర్తి మాస్టారు గణిత, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా విశేష సేవలు అందించి అమృతోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా ఈ సత్కార సభను నిర్వహించారు. కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీ పూర్వ ప్రిన్సిపాల్ బోకం దేముడు అధ్యక్షతన, పురుషోత్తపురం పాఠశాల హెచ్ఎం చిరికి శ్రీనివాసరావు సమన్వయకర్తగా ఆయన శిష్యులు, ముఖ్యంగా 1983-84 బ్యాచ్ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. వెంకటరమణ మాట్లాడుతూ శ్రీరామమూర్తి మాస్టారు, పద్మావతి దంపతులు తనకు దైవ సమానులన్నారు. చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ మాస్టారి శిష్యరికం వల్లనే 1983-84 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులతో పాటు, ఇతర బ్యాచ్‌ల విద్యార్థులు కూడా అత్యున్నత స్థాయిలో ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో వెలమ సంఘం కార్యదర్శి వెన్నెల సూర్యనారాయణ, సబ్బవరం మాజీ జెడ్పీటీసీ రొంగలి దేముడుబాబు, హెచ్ఎం చిరికి శ్రీనివాసరావు, కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీ రిటైర్డ్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ప్రతిభా పాఠశాల కరస్పాండెంట్ ఆదిరెడ్డి వెంకటరమణ, డైట్ రిటైర్డ్ అధ్యాపకుడు శర్మ, తహసీల్దార్ ప్రసాద్‌తో పాటు వందలాది మంది మాస్టారి శిష్యులు పాల్గొన్నారు.

రవాణా రంగ సమ్మెను జయప్రదం చేయండి



రైల్వేస్టేషన్ వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వామనమూర్తి, ఆటో డ్రైవర్స్

తాటిచెట్లపాలెం: ఈనెల 9న దేశవ్యాప్తంగా జరగనున్న రవాణా రంగ సమ్మెను విశాఖలోని రవాణా రంగ కార్మికులు జయప్రదం చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి కోరారు. ఈ మేరకు గురువారం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఆటో స్టాండ్ వద్ద జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వామనమూర్తి మాట్లాడుతూ, ప్రైవేటు సంస్థలకు అనుకూలంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్‌సీ, సెన్సార్ డ్రైవింగ్ లైసెన్స్ విధానాన్ని రద్దు చేయాలని, అలాగే వాహనమిత్ర కింద ఆటో డ్రైవర్లకు వెంటనే రూ. 15,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన హిట్ అండ్ రన్ చట్టం (సెక్షన్ 106(2))ను రద్దు చేయాలని, డీజిల్, పెట్రోల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు మోటార్ రంగ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమ్మెకు రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొని మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్టాండ్ అధ్యక్షుడు వై. వెంకట్, జై గణేష్ కుమార్, రవి, కృష్ణ, సత్తిబాబు, చిన్న అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన మురుగుతో అవస్థలు



సీతంపేట మెయిన్‌రోడ్‌లో శ్రీవిశ్వ కళాశాల వద్ద నిలిచిన మురుగునీరు



భాష్యం స్కూల్ వద్ద లీకవుతున్న మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులోని సీతంపేట మెయిన్‌రోడ్‌లో గత కొద్ది రోజులుగా మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ స్థానికులు, పాదచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ముఖ్యంగా శ్రీవిశ్వ కళాశాల వద్ద, అలాగే భాష్యం స్కూల్ వద్ద డ్రెయినేజీ బ్లాక్ అవ్వడంతో ఈ సమస్య తలెత్తింది. రోడ్డుపై మురుగునీరు నిలిచిపోవడంతో వాహనాలు వెళ్ళినప్పుడు మురికి నీరు పాదచారులపై చిందుతోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వారం పది రోజులుగా ఈ పరిస్థితి ఉన్నప్పటికీ, సంబంధిత పారిశుధ్య అధికారులు, సిబ్బంది దృష్టి సారించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

6న తెలుగు నాటక డిజిటల్ గ్రంథాలయం ప్రారంభం

సీతంపేట: తెలుగు నాటక డిజిటల్ గ్రంథాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఈనెల 6వ తేదీ 10 గంటలకు ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరుగుతుందని రైటర్స్ అకాడమి చైర్మన్ వీవీ రమణమూర్తి తెలిపారు. జీవితాన్ని నాటక రంగానికి అంకితం చేసిన దివంగత బాదంగీర్ సాయి ప్రారంభించిన నాటక గ్రంథాలయంలోని 10 వేల నాటక పుస్తకాలను బెంగళూరు చెందిన మనసు ఫౌండేషన్ డిజిటలైజేషన్ చేసిందన్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ చేతుల మీదుగా వెబ్‌సైట్ ఆవిష్కరణ జరుగుతుందని, సాహితీవేత్తలు, కళాభిమానులు పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు.

ఎంవీవీఎస్ మూర్తికి ఘన నివాళి

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలోని ఉత్తర నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో గురువారం మాజీ ఎంపీ డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు అల్లూరి జయంతి

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో శుక్రవారం విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాష్, సీహెచ్‌ఎస్ఎస్ ప్రసాదరావు తెలిపారు. సాయంత్రం 5.45 గంటలకు అల్లూరి జయంతిని నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా మాధవధార మురళీమాధవ విద్యాలయం విద్యార్థులతో అల్లూరి సీతారామరాజు నృత్య రూపకం ప్రదర్శన ఉంటుందని.. వాకర్స్ క్లబ్ సభ్యులు, వాకర్స్, సందర్శకులు హాజరు కావాలని కోరారు.

వాకర్స్ వ్యవస్థాపకుడు బుచ్చయ్యకు సత్కారం



బుచ్చయ్యను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు నిమ్మగడ్డ బుచ్చయ్యను క్లబ్ సభ్యులు, వాకర్స్ ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయనకు పూల కిరీటం, శాలువాతో సన్మానం చేశారు.వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ కె. ద్వారకానాథ్, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం అతిథులుగా పాల్గొని, బుచ్చయ్య వాకర్స్ ఉద్యమానికి, సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నలుగురు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు వాకర్స్ క్లబ్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి



ప్రమాదకరంగా గోతులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కు రహదారిని కలుపుతూ నిర్మించిన మార్గంలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ రోడ్డుకు దిగువన ఉండటంతో ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు, అనుబంధ రహదారి మరమ్మతుల్లో భాగంగా ఇటీవల నిర్మించిన కల్వర్టు ఆనుకుని తవ్విన గుంతలను సరిగా పూడ్చకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి వల్ల తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఈ గుంతలను పూడ్చివేయాలని, అలాగే మ్యాన్‌హోల్‌ను రహదారికి సమాంతరంగా ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

'అమృత్' కష్టాలు



80 అడుగుల రోడ్డు నుంచి శ్రీనివాసనగర్‌కు వెళ్లే రహదారి దుస్థితి



సుపథ స్కూల్‌రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు



నందగిరినగర్‌లో అధ్వానంగా రహదారులు

సీతంపేట: జీవీఎంసీ పరిధిలోని 43, 44 వార్డుల్లో జరుగుతున్న అమృత్ 2.0 పనులు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ముఖ్యంగా శ్రీనివాసనగర్, నందగిరినగర్ ప్రాంతాల్లో నీటి పైపుల కోసం రోడ్లను తవ్విన తర్వాత, ఆ గోతులను సరిగా పూడ్చకపోవడంతో స్థానికులు అవస్థల పాలవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ తవ్విన రోడ్లు బురదమయంగా మారాయి. ఇళ్ల ముందు, వ్యాపార దుకాణాల ముందు బురద, మట్టి, నీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా, రోడ్లు చిత్తడిగా మారడంతో పాదచారులు, వాహనదారులు జారిపడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్



డోర్లు ఊడిన ఫ్యూజ్‌బాక్సు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు, 104 ఏరియా పరిధిలోని బాపూజీనగర్ నుంచి జ్యోతినగర్ వెళ్లే రహదారుల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలకు పచ్చని పొదులు, పొదలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా బాపూజీనగర్‌లోని ఓ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఫ్యూజ్‌బాక్స్ డోర్లు తెరుచుకుని రక్షణ గోడలకు తగులుతున్నాయి. ఈ ప్రాంతంలో నడిచే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ముఖ్యంగా వర్షాలకు వాకర్లు.. ప్రమాదాలు జరుగుతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. గతంలో వేసవిలో ఏపీఈపీడీఎల్ అధికారులు నిర్వహించే విద్యుత్ భద్రతా పనుల్లో ఈ పొదులను తొలగించమని సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే అధికారులు మేల్కొంటే బాగుంటుందని పలువురు స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖాధికారులు వెంటనే స్పందించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


సేవలు విస్తరిస్తాం



వేడుకల్లో పాల్గొన్న అతిథులతో ఎస్తేరురాణి ఫౌండేషన్ ట్రస్ట్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: ఎస్తేరురాణి ఫౌండేషన్ ట్రస్ట్ 8వ వార్షికోత్సవాన్ని గురువారం ద్వారకానగర్‌లోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గత 8 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో పేదలకు, నిరాశ్రయులకు సేవలందిస్తున్నామని, భవిష్యత్తులో ఈ సేవలను మరింత విస్తరిస్తామని ట్రస్ట్ చైర్మన్ ఎస్తేరు రాణి తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం, వస్త్రదానం, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, కుట్టుమిషన్లు, వికలాంగులకు ట్రైసైకిల్స్ పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు ట్రస్ట్ స్టేట్ కమిటీ లీడర్ ఎండి రోష్ని వివరించారు. ఈ వేడుకలకు హాజరైన ప్రజాపిత బ్రహ్మకుమారిస్ ప్రతినిధి బి.కె. రామేశ్వరి, ఫౌండేషన్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో భారత్ బచావో విజయనగరం జిల్లా అధ్యక్షులు అబ్దుల్ కరీం, దక్షిణ హాకర్స్ యూనియన్ ప్రెసిడెంట్ ఎర్రబిల్లి ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



సినీ గీతాలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

సీతంపేట: నగరానికి చెందిన గాయనీ గాయకులు శోభన్‌బాబు నటించిన చిత్రాలలోని గీతాలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. వెంకీ రిథమ్స్ సంస్థ గురువారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ సినీ సంగీత విభావరిని నిర్వహించింది. గాయనీ గాయకులు వెంకటేష్, బాబ్జి, ఎ. నరసింగరావు, రమేష్, కృష్ణంరాజు, రంజిత, సుజాత, జ్యోతి, మాధురి సినీ గీతాలను ఆలపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు.